క్లుప్తంగా

క్రీడాకారుడికి సన్మానం


పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు శ్రీనివాసరావుని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: గత నెల 28న న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 100 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన క్రీడాకారుడు మందపల్లి శ్రీనివాసరావుని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఘనంగా సన్మానించారు. గోడిలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన శ్రీనివాసరావును ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ దుశ్శాలువాతో సత్కరించారు. దుబాయ్‌లో జులై 31 నుంచి ఆగష్టు 6 వరకూ జరిగే అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించానట్లు శ్రీనివాసరావు వివరించారు. అంతర్జాతీయ క్రీడల్లో శ్రీనివాసరావు ఉత్తమ ప్రదర్శన చేసి దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఇజ్రాయిల్ ఆకాంక్షించారు.

స్కిల్ హబ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని స్కిల్ హబ్‌ల్లో నైపుణ్య శిక్షణ నిమిత్తం నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అమలాపురం నియోజకవర్గంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ లావణ్య సూచిస్తున్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీటెక్ చదివిన విద్యార్థులు శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తోడ్పాటునందిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 93808 08275 ఫోన్ నెంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

టెలిఫోన్ కీప్యాడ్ నాణెం సేకరణ



కృష్ణ కామేశ్వర్ సేకరించిన టెలిఫోన్ కీప్యాడ్ నాణెం

అమలాపురం టౌన్: 1876లో టెలిఫోన్‌ను కనిపెట్టిన అలెగ్జాండర్ గ్రహంబెల్ స్మారకార్థం యునైటెడ్ కింగ్‌డమ్ దేశం ముద్రించిన టెలిఫోన్ కీప్యాడ్ ఆకారంలో ఉన్న రెండు పౌండ్ల నాణేన్ని అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. ఈ నాణెంపై ఒకవైపు టెలిఫోన్ కీప్యాడ్, అలెగ్జాండర్ గ్రహంబెల్ పేరును ముద్రించారు. మరోవైపు రెండో ఎలిజిబెత్ రాణి ముఖ చిత్రాన్ని ముద్రించారు. కృష్ణ కామేశ్వర్ ఇటీవల లండన్ నుంచి అమలాపురం వచ్చిన తన స్నేహితుల సహకారంతో నాణేన్ని సేకరించారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగించాలి

అమలాపురం టౌన్: అమలాపురం రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొనసాగించాలని విజయవాడ రైల్వే కార్యాలయంలో సీనియర్ డీసీఎం వి.రాంబాబు, డీఆర్ఎం ఎస్.మోహన్‌లకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మంగళవారం వినతి పత్రాలు అందించినట్లుగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటెద్దు బాబ్జి తెలిపారు.

అమలాపురం టౌన్: అమలాపురం సర్క్యులర్ బజారులో ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఎత్తివేత నిర్ణయాన్ని విరమించి ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, టీడీపీ నాయకులు రిజర్వేషన్ కౌంటర్ వద్ద మంగళవారం వేర్వేరుగా నిరసనలు చేపట్టారు.

అమర్‌నాథ్‌కు శివయాత్ర


శివయాత్ర ప్రారంభించిన లక్ష్మణరావు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం తానేల్లంక గ్రామానికి చెందిన శివ భక్తుడు మొల్లేటి లక్ష్మణరావు శివ మాల ధరించి శివ యాత్రకు బయలుదేరారు. మూడు రాష్ట్రాల్లోని 216 శివాలయాలను ఆయన దర్శించనున్నారు. మంగళవారం స్వగ్రామం తానేల్లంక శివాలయం నుంచి ఆయన యాత్ర ప్రారంభించారు. కాశీ మీదుగా అమర్‌నాథ్ వరకూ యాత్ర కొనసాగనుందని లక్ష్మణరావు తెలిపారు.

పీహెచ్‌సీ సిబ్బందికి సత్కారం


రమేష్ దంపతులను దుశ్శాలువాతో సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

ఉప్పలగుప్తం: స్థానిక పీహెచ్‌సీలో ఎంపీహెచ్ఏగా పనిచేసి ఇటీవల పదోన్నతిపై ఐ.పోలవరం మండలం కేసనకుర్రుకు బదిలీ అయిన దొమ్మేటి రమేష్‌ను స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎల్.నాగార్జున, సిబ్బంది పూలమాలలు వేసి దుశ్శాలువాతో సత్కరించి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎం.విజయలక్ష్మి, ఐ.చిట్టిబాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులోకి అధునాతన వైద్య సేవలు

- ప్రారంభానికి సిద్ధమవుతున్న సామాజిక ఆరోగ్య కేంద్రం
- రూ.3.90 కోట్లతో 50 పడకల ఆస్పత్రిగా విస్తరణ


అన్ని హంగులతో రూపుదిద్దుకున్న అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రం

అల్లవరం: ఆరోగ్యమే మహా భాగ్యం అన్న సూక్తిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్షరాలా నిజం చేస్తుంది. నిరుపేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తుంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా నెలలో రెండు పర్యాయాలు రోగి వద్దకే ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. అంతేకాకుండా ఏళ్ల తరబడి ఆధునీకరణకు నోచుకోని ఆస్పత్రులను నాడు–నేడు పథకం ద్వారా రూపురేఖలు మార్చడమే కాకుండా అధునాతన వైద్య సేవల్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

మండల ప్రధాన కేంద్రం అల్లవరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రివర్యులు పినిపే విశ్వరూప్ చొరవతో రూ.2.50 కోట్ల నిధులతో 30 పడకల ఆస్పత్రి రూపుదిద్దుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రికిగా విస్తరించేందుకు నాడు–నేడు నిధులు రూ.3.90 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రి పనులన్నీ పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమవుతోంది. అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సుమారు 60 వేల మందికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందనుంది.

అత్యాధునిక పరికరాల ఏర్పాటు

ఆస్పత్రి విస్తరణతో పాటు ఎక్స్‌రే ప్లాంట్, చిన్నారుల కోసం ఫొటో థెరఫీ, పుట్టిన బిడ్డను బాక్స్‌లో ఉంచేందుకు వార్మర్, గర్భిణుల కడుపులో ఉన్న పిండం ఎదుగుదల, వాటి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించే పరీక్షలు నిర్వహించేందుకు సీటీజీ పరికరం, గుండె పనితీరుని పరీక్షించే అత్యాధునికమైన ఈసీజీ, గర్భిణులకు స్కానింగ్ పరికరాలను ఆస్పత్రిలో ఏర్పాటుచేస్తున్నారు. ఇవే కాకుండా ప్రతి రోజు రక్త పరీక్షలు నిర్వహించేలా ల్యాబ్ నిర్మిస్తున్నారు. నిరంతరం విద్యుత్ అందుబాటులో ఉండేలా జనరేటర్ సౌకర్యంతో పాటు 104, 108 వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక భవనం, శవ పరీక్షలు నిర్వహించేందుకు మార్చురీ, బయో మెడికల్ వ్యర్థాలను నిల్వ ఉంచే గదులను ప్రత్యేకంగా నిర్మించారు. రోగులకు నిత్యం వైద్య సేవలను అందించేందుకు ఇప్పటికే గైనిక్, దంత, మత్తు, సర్జన్ డాక్టర్లు ఏడుగురితో పాటు హెడ్ నర్సు–1, స్టాఫ్ నర్సు–7, ఇతర విభాగాల్లో 16 మంది, శానిటేషన్–6, సెక్యూరిటీ డ్యూటీల్లో–4 విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెలాఖరుకు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించేందుకు జిల్లా వైద్య శాఖ రంగం సిద్ధం చేస్తుంది.

విస్తరణతో మెరుగైన వైద్య సేవలు



అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని విస్తరించడంతో మెరుగైన వైద్య సేవలు రోగులకు అందనున్నాయి. రోగుల కోసం అత్యాధునిక వైద్య పరికరాలను అమర్చుతున్నారు. రక్త పరీక్షలు, గర్భిణులకు పరీక్షలు, ప్రసవాలు, దంత సమస్యలు, శస్త్రచికిత్స సేవలను అందించనున్నాం.

– డాక్టర్ సుధీర్‌కుమార్, అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రం, అల్లవరం

మహిళా మార్ట్‌ల ద్వారా ఆర్థిక చేయూత

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- ముమ్మిడివరంలో మహిళా మార్ట్ ప్రారంభం


మహిళా మార్ట్ ప్రారంభించి సరకులు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: మహిళా మార్ట్‌ల ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మార్ట్‌ల ద్వారా ఉపాధితో పాటు విక్రయాల ద్వారా వచ్చే లాభాలతో మెరుగైన జీవనోపాధి పొందొచ్చన్నారు. ప్రభుత్వం చేయూత, ఆసరా పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయానికి పొదుపు సంఘాల మహిళలు మరికొంత నగదు జోడించి ఈ మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. మార్టులకు ప్రభుత్వ ప్రోత్సాహంతో హెచ్‌యూఎల్, ఐటీసీ, రిలయన్స్ లాంటి ప్రముఖ కంపెనీలు తక్కువ ధరకే సరకులు సరఫరా చేస్తున్నాయన్నారు. వినియోగదారులకు తక్కువ ధరలకే సరకులు అందించి వారిని ఆకట్టుకోవాలని సూచించారు. రాష్ట్రంలోనే అధిక లాభాలు ఆర్జించే మార్ట్‌గా ముమ్మిడివరం మహిళా మార్ట్‌ను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, ఎంపీపీ కోలా గంగా భవానీ, జెడ్పీటీసీలు కుడిపూడి శంకరరావు, నేల కిశోర్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశిబాలమునికుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జి, మండల పార్టీ అధ్యక్షులు జగతా పద్మనాభం, కాదా గోవిందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- భీమనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం


భీమనపల్లిలో లబ్ధిదారుకు సంక్షేమ వివరాలను అందజేస్తున్న పినిపే శ్రీకాంత్ తదితరులు

ఉప్పలగుప్తం: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని భీమనపల్లి గ్రామంలో సచివాలయం –2 పరిధిలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండోరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. నిరుపేదల కుటుంబాల్లో విద్యా వెలుగులు నింపాలని అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన అమలుచేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు చేయూత, కాపు మహిళలకు కాపు నేస్తం, డ్వాక్రా మహిళలకు ఆసరా వంటి పథకాలతో సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, శిరంగు రాజా, జంపన బాపిరాజు, ఆకేటి సత్యవిష్ణు, రాయపురెడ్డి నాగు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పనులు త్వరితగతిన చేపట్టాలి

నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: నగర పంచాయతీలో వార్డుల వారీగా గ్రావెల్ రోడ్లు, డ్రైనేజీలు వంటి అత్యవసర పనులను త్వరితగతిన చేపట్టాలంటూ నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగర పంచాయతీ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం కౌన్సిల్ సభ్యులు, ఇన్‌చార్జ్‌లు, అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వార్డుల్లో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. వర్షాల వేళ లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా డ్రెయిన్లు శుభ్రపరిచేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వీధిలైట్లు, తాగునీరు, శానిటేషన్ వంటి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పెన్మత్స చిట్టిరాజు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగింపునకు చర్యలు

ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు


సర్క్యులర్ బజార్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ సర్క్యులర్ బజార్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్ సెంటరు అక్కడే కొనసాగేలా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చర్యలు చేపట్టారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు చెప్పారు. మున్సిపల్ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు రైల్వే రిజర్వేషన్ కౌంటర్ సెంటరును మంగళవారం సాయంత్రం సందర్శించారు. సర్క్యులర్ బజార్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఈ రిజర్వేషన్ కౌంటర్‌ను పైఅంతస్తులోని షాపుల్లోకి మార్చేందుకు సూర్యనారాయణరావు ప్రతిపాదించారు. ఇదే విషయంపై మంత్రి పినిపే విశ్వరూప్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. మంత్రి విశ్వరూప్ సైతం అందుకు సంబంధించి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణికి సూచనలిచ్చారు. ఇప్పటికే అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించేందుకు ఎంపీ చింతా అనురాధ కూడా రైల్వే ఉన్నతాధికారులతో సోమవారమే మాట్లాడారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తెలిపారు. రిజర్వేషన్ కౌంటర్ ఇక్కడే కొనసాగేందుకు కృషి చేసిన మంత్రి విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ అనురాధలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, చిట్టూరి పెదబాబు, మున్సిపల్ ఆర్వో శివాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి సత్యనారాయణ, చప్పిడి శోభన్‌బాబు తదితరులున్నారు.

ఘనంగా మల్లాడి పుట్టినరోజు వేడుకలు


మల్లాడిని గజమాలతో సత్కరిస్తున్న బలుసుతిప్ప గ్రామస్తులు, అభిమానులు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, టీటీడీ సభ్యుడు మల్లాడి కృష్ణారావు 60వ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొని ఆయనను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఆయన స్వగృహం వద్ద ఏర్పాటుచేసిన వేడుకల్లో అమలాపురం ఎంపీ అనూరాధ, ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, గజల్ శ్రీనివాస్ తదితరులు ఆయనకు పూలమాలలు వేసి సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్‌లు ధరించాలని అవగాహన కల్పిస్తూ యానాం పురవీధుల్లో మల్లాడి అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు.

కాట్రేనికోన: మండలంలోని బలుసుతిప్ప, పల్లం, ఎంజీఆర్ కాలనీలో మల్లాడి కృష్ణారావు జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. బలుసుతిప్ప సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, ఆదినారాయణ ఆధ్వర్యంలో నాయకులు తిరుమాని సత్తిబాబు, ఓలేటి సతీష్, సంగాని చిన్ని, పెమ్మాడి రాముడు, ఆయన అభిమానులు బైక్ ర్యాలీగా యానాం తరలివెళ్లి ఆయనను గజమాలతో సత్కరించారు.

ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న అడబాల సత్యనారాయణ

అమలాపురం రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనను తెలియజేసేందుకు చేపట్టిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, రాష్ట్ర స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం అన్నారు. స్థానిక ఎర్రవంతెన వద్ద ఉన్న గీతా మందిర్‌లో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ ఇప్పటికే పూర్తి చేసిన బూత్ కమిటీల ద్వారా ఇంటింటికీ వెళ్లి మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అయ్యల భాస్కరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, ఆకుల వీరబాబు, గనిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పోటీ

యానాం: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరిలోని ఏకైక ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిని బరిలోకి దింపుతున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు స్వామినాథన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పార్టీని మరింత పటిష్టం చేసేందుకు మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించి కేంద్రమంత్రిని చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు.

వలంటీర్ వ్యవస్థతోనే ప్రజలకు సంక్షేమం


అయినవిల్లిలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: వలంటీర్ల వ్యవస్థతోనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు 100 శాతం అందుతున్నాయని, సంక్షేమ పథకాలు అమల్లో వలంటీర్లు విశిష్టమైన పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిచారు. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, ఎస్.పెదపాలెం, వెలవలపల్లి, చింతనలంక, ముడుపల్లి, క్రాప, శంకరాయగూడెం గ్రామాలకు చెందిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సత్కరించి, ప్రోత్సాహకాలు అందజేశారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ప్రముఖపాత్ర పోషిస్తున్నారన్నారు. వారి ఉత్తమ సేవలను గుర్తించి ప్రభుత్వ మరిన్ని పోత్సాహకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీ వెంకటాచార్య, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, ఎంపీపీ మట్టపర్తి నాగవెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచులు గుమ్మడి ప్రసాద్, శీలం వెంకటేశ్వరరావు, కాశి వీరవెంకట సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులను నియంత్రించాలి


చొప్పెల్లలో అతిసార నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

ఆలమూరు: వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల దృష్ట్యా సంభవించే సీజనల్ వ్యాధులను తరిమికొట్టాలని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు మంగళవారం అతిసార నియంత్రణ మాసోత్సవాలు, మలేరియా నివారణ మాసోత్సవం జరిగింది. ఆయా గ్రామాల సచివాలయాల పరిధిలో వైద్యాధికారులు డి.సువర్చలానాయుడు, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు నేతృత్వంలో అవగాహన సదస్సులు జరిగాయి. అతిసార వ్యాధిగ్రస్తులకు సత్వరమే ఓఆర్ఎస్ ద్రావణంతో పాటు జింక్ మాత్రలను అందజేయాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని మిశ్రమం చేసి రోగికి అందించవలసిన విధానాన్ని ఆరోగ్య, ఆశ సిబ్బందికి వివరించారు. అలాగే దోమలను వృద్ధి చెందకుండా చేయడం ద్వారా మలేరియాను నివారణ సాధ్యమేనన్నారు. ఇంట్లోను, పరిసరాల్లోను నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు.

చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

తాళ్లరేవు: మహిళ మెడలోంచి బంగారు గొలుసును తెంపుకుపోయిన ఘటన తాళ్లరేవు మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఇంజరం గ్రామానికి చెందిన మంచం చిట్టిబాబు ఆయన కుమార్తె ద్విచక్రవాహనంపై మంగళవారం యానాం వెళ్లి ఇంజరం తిరిగి వస్తున్నారు. స్థానిక చర్చి సెంటర్‌లో రాత్రి 8.30 గంటల సమయంలో బైక్‌పై వేగంగా వెనుక నుంచి వచ్చి మహిళ మెడలోని బంగారు గొలుసును తెంపుకుపోతుండగా ఆమె గట్టిగా కేకలు వేశారు. దీంతో స్థానికులు చైన్ స్నాచర్‌ను వెంబడించగా ఇంజరం వంతెన సమీపంలో పట్టుబడ్డాడు. చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి చేసి కోరంగి పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమలాపురంలో 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

అమలాపురం రూరల్: అధిక విద్యుత్ వినియోగం కారణంగా అమలాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్(సీటీ) మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగి దగ్ధమైంది. ఫలితంగా అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, అంబాజీపేట మండలాల్లో సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తొలుత ముమ్మిడివరం సబ్‌స్టేషన్ ద్వారా అమలాపురం పట్టణంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాను పునరుద్ధరించారు. వేసవి నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా డివిజన్ ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్ నేతృత్వంలో బొమ్మూరు నుంచి యుద్ధ ప్రాతిపదికన కొత్త కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ రప్పించి పునరుద్ధరణ పనులు చేపట్టారు.

ఏఎంసీ చైర్మన్ కుడుపూడి సాయం


జైభీంపేటలో సుజాతకు నగదు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ జైభీమ్‌పేట గ్రామానికి చెందిన గెద్దం సుజాతకు ఇటీవల బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్స చేశారు. ఆమె కుటుంబానికి ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మంగళవారం రూ.10 వేల నగదు, బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ సుజాతకు ఇటీవల రెండుసార్లు శస్త్రచికిత్స జరిగిందని, ఆమె భర్త కొన్నేళ్ల క్రితం మరణించగా ఇద్దరు పిల్లలతో కుటుంబం సాగిస్తుందని తెలిపారు.

ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోండి

తాళ్లరేవు: సీతారామపురం గ్రామంలో ఉన్న రిలయన్స్ ధీరూబాయ్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్, ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం అమలు చేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ ఇన్‌చార్జ్ ఎంజే గోపాలరావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. బుద్ధి మాంద్యత, వినికిడి లోపం, మాటలు రాని, ప్రవర్తనలో లోపాలు గల 0–14 ఏళ్ల పిల్లలకు ఉచిత శిక్షణనిచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పిల్లలకు ఉచిత ట్రాన్స్‌పోర్టు సర్వీసుతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, స్పీచ్, ఫిజియో థెరపీలతో పాటు యోగా, స్పోర్ట్స్ తదితర వాటిలో శిక్షణనిచ్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామన్నారు.

నాన్ నీట్ కోర్సులకు 13,268 దరఖాస్తులు

యానాం: నాన్ నీట్ కోర్సుల్లో ప్రవేశానికి సెంటాక్ ద్వారా 13,268 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోగా 10,760 మంది పూర్తి స్థాయిలో దరఖాస్తును పూర్తి చేసి సమర్పించారని అధికారులు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను నాన్ నీట్ కోర్సులకు గత నెల 17 నుంచి సెంటాక్ ఆన్‌లైన్ దరఖాస్తులను తీసుకుంటుంది. అండర్ గ్రాడ్యుయేట్ వృత్తి కోర్సులైన బీటెక్, బీఎస్సీ(అగ్రికల్చర్, నర్సింగ్), ఫిజియోథెరపీ, బీఫార్మసీ, బీఏఎల్ఎల్‌బీ(లా), డిప్లొమా కోర్సులు, బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, ఫైన్ ఆర్ట్స్ తదితర కోర్సులకు దరఖాస్తు చేసేందుకు మంగళవారంతో గడువు ముగిసింది.

సర్పంచ్‌ల సంఘ కార్యవర్గ సభ్యురాలిగా సుభాషిణి


కార్యవర్గ సభ్యురాలిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న సుభాషిణి

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సర్పంచ్‌ల సంఘ కార్యవర్గ సభ్యురాలిగా అల్లవరం మండలం తుమ్మలపల్లి సర్పంచ్ వడ్డి సుభాషిణి మంగళవారం ఎన్నికయ్యారు. కాకినాడలో వ్యవస్థాపక అధ్యక్షుడు యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్, ఏపీ సర్పంచ్ సంఘ అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల కార్యవర్గ సభ్యురాలిగా సుభాషిణిని ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణాన్ని సమష్టిగా కాపాడుకుందాం

అమలాపురం టౌన్: పర్యావరణ హిత జీవన శైలి కార్యక్రమాల్లో భాగంగా స్థానిక తేజస్విని ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పర్యావరణ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని మనమంతా సమష్టిగా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం సొసైటీ సమకూర్చిన మొక్కలను ఆ ప్రాంత ప్రజలకు, విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, సొసైటీ చైర్మన్ టి.రమా, కార్యదర్శి ఉద్దేశపు వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ విప్పర్తి రమేష్ పాల్గొన్నారు.

మంత్రి తనయుడి పరామర్శ

అమలాపురం రూరల్: ఇటీవల మృతిచెందిన నడిపూడి మాజీ సర్పంచ్ చెల్లిబోయిన తోయజాక్షి కుటుంబ సభ్యులను మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, జెడ్పీటీసీ సభ్యులు పందిరి హరిరామ్‌గోపాల్ మంగళవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. తోయజాక్షి కుమారుడైన ప్రస్తుత సర్పంచ్ చెల్లిబోయిన నానిని పరామర్శించి ధైర్యం చెప్పారు. తోయజాక్షి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటుచేయాలి

యానాం: పుదుచ్చేరిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం రంగసామికి విల్లూపురం ఎంపీ డి.రవికుమార్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు తదితర 12 రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. 2018–2021 మధ్యకాలంలో పుదుచ్చేరిలోని యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్లలో 20 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయన్నారు. అయితే వాటిపై ఇప్పటికీ విచారణ నిర్వహించడం లేదని, ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు.